ప్రజాశక్తి

శనివారం 5 ఆగస్టు 2023 5

పార్వతీపురం మన్యం



గజరాజుల సంచారం

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-వీరఘట్టం

విజయనగరం జిల్లా వంగర మండలం నుంచి గురువారం రాత్రి వీరఘట్టం మండలంలోకి మళ్లీ ఏనుగుల గుంపు ప్రవేశించింది. మండలంలోని పివిఆర్ పురం, బిటివాడ గ్రామాల్లో గురువారం రాత్రి గజరాజులు సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గజరాజుల సంచార కారణంగా రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా గడిపినట్లు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున విజయనగరం జిల్లా వంగర మండలం శివ్వాం గ్రామ సమీపంలో గజరాజులు తిష్ట వేశాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

గ్రీన్ అంబాసిడర్లపై దౌర్జన్యం

- సిఐటియు నాయకుల బలవంతపు అరెస్టులు
- మధ్యాహ్నం వరకు కొనసాగిన ఆందోళన
- దిగొచ్చిన అధికారులు
- 15 తేదీలోగా వేతనాలు చెల్లిస్తామని కలెక్టర్ హామీ



సిఐటియు నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు, విజయనగరం కలెక్టరేట్ వద్ద గ్రీన్ అంబాసిడర్లను అడ్డుకుంటున్న పోలీసులు



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పంచాయతీ కార్మికుల నియామకంలో టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్ లు, పంచాయతీ కార్మికులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్ గేటు వద్ద బైటాయించి ఎవరినీ లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. 18 నెలలుగా వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలను ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోకి వెళ్లి అధికారులకు తమ బాధను చెప్పుకునేందుకు కార్మికులు ప్రయత్నం చేయగా పోలీసులు విరుచుకుపడి సి ఐ టి యు నాయకులను అరెస్టులు చేసే ప్రయత్నం చేశారు. దీంతో కార్మికులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాలు మధ్య తోపులాటలు జరిగాయి. దీంతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ, మద్దిల రమణను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి పోలీసు వ్యానులో ఎక్కించి అరెస్టు చేశారు. దీంతో కార్మికులు పోలీసు వ్యానును అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వారిని పక్కకు నెట్టి సిఐటియు నాయకులను స్టేషన్ కు తరలించారు.

దీంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేసిన కార్మికులు సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ నాగలక్ష్మి పోలీసుల ద్వారా ధర్నా చేస్తున్న కార్మిక సంఘం నేతలను లోపలికి రావాలని కబురు పంపించారు. దీంతో ఆరుగురు సభ్యులతో వి.లక్ష్మి వెళ్లి కలెక్టర్‌కు సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ ఈనెల 15 తేదీ లోగా కార్మికులు వేతనాలు చెల్లిస్తామని, తొలగించిన కార్మికులందరినీ పనిలోకి తీసుకుంటా మని, పంచాయతీల్లో టెండర్ ద్వారా కార్మికులను తీసుకునే విధానాన్ని రద్దు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

అంతకు ముందు కలెక్టరేట్ ముట్టడిని ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, ఉపాధ్యక్షులు బి.సూర్య నారాయణ, గ్రీన్ అంబాసిడర్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. రాష్ట్రంలో పోరాడి సాధించుకున్న జీవోలను అమలు చేయాలని హైకోర్టు తీర్పునిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్‌ఐ అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి పదివేల రూపాయలు వేతన ఇవ్వాలని డిమాండ్ చేశారు. 6 నెలల నుంచి 18నెలల వరకు ఉన్న బకాయి వేతనాలు వెంటనే ఇవ్వాలని, 2015లో హైకోర్టు ఇచ్చిన తీర్పురాష్ట్రంలో గ్రామపంచాయతీ కార్మికులకు టెండర్ తో సంబంధం లేకుండా కార్మికులను కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించకుండా నెలల తరబడి వెట్టి చాకిరీ చేయించుకుటోందన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లోను పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మాత్రమే రూ.18వేలు వేతనం అనడం ఎంతవరకు సబబు అన్నారు. పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులదరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి విధుల్లో కొనసాగించాలని, కనీస వేతనం 26వేలకు తగ్గకుండా ప్రభుత్వం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు దండి శ్రీనివాస్, సిఐటియు నాయకులు బి.శ్రీను. పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు బోని రామారావు, తోటయ్య, కామేష్ ,సిహెచ్ అప్పారావు జిల్లా నుంచి తరలి వచ్చిన కార్మికులు పాల్గొన్నారు.

376 అంగన్వాడీ భవనాలకు మరమ్మతులు

ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

విశాఖ జోన్ పరిధిలో 376 అంగన్వాడీ భవనాల మరమ్మతుల కోసం నాడు-నేడు నిధులు మంజూరైనట్లు ఐసిడిఎస్ ఆర్‌జెడి చిన్మయిదేవి తెలిపారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నిర్మాణంలో ఉన్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ విశాఖ జోన్ పరిధిలో 68 ఐసిడిఎస్ ప్రాజెక్టులు ఉన్నాయని, వీటిలో అంగన్వాడీ భవనాలు 13,819 ఉన్నాయని తెలిపారు. 57,321 మంది గర్భిణులు, 63,964 మంది బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్నామని చెప్పారు. ఏడు నెలల నుండి మూడేళ్ల పిల్లలు 1,71569 మంది అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్నారని తెలిపారు. 395 మంది పిల్లలు చిల్డ్రన్స్‌హోంలో ఉంటున్నట్లు వెల్లడించారు. వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు 4 వరకు పనిచేస్తున్నాయన్నారు. వివిధ నగరాల నుంచి చిన్న చిన్న తప్పులు చేసిన చిన్నారులు తమ ఆధీనంలో నడుస్తున్న వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో 99 మంది వరకు ఉన్నారని తెలిపారు. నాలుగు స్వధార్‌హోంలలో సుమారు 35 మంది వరకు యువతులు వివిధ రకాల పనులు చేస్తున్నట్లు చెప్పారు.

3 శిశుగృహాలలో తల్లిదండ్రులు లేని చిన్నారులను 241 మంది వరకు ఉంచి వాళ్లకు వివిధ రకాల వత్తులు నేర్పిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం జోన్ పరిధిలో భాల్య వివాహాలు చేసుకున్న చిన్నారులు సుమారు 26 మంది వరకు ఉన్నారని చెప్పారు. కోవిడ్‌తో మృతిచెందిన తల్లిదండ్రులు లేని సుమారు 61 మంది చిన్నారులు శిశు గృహాల్లో ఉంచినట్లు చెప్పారు. గృహహింస చట్టం కింద నమోదు చేసిన 1474 మంది యువతులకు కౌన్సిలింగ్ చేశామన్నారు. 572 మంది డొమెస్టిక్ వైలెన్స్ కేసులు విశాఖపట్నం జోన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఇరిడి, గుమ్మ గ్రామాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఎల్విన్‌పేట గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ కె.విజయగౌరి, భద్రగిరి సిడిపిఒ సిహెచ్ సుశీలదేవి, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని

ఖాళీ పేట్లతో నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

జీతాలు చెల్లించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శుక్రవారం డిఇఒ కార్యాలయం వద్ద ఖాళీ ప్లేట్లతో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. జీతాలపైనే ఆధారపడుతున్న ఉపాధ్యాయులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా కొత్తగా ఏ జిఒ తీసుకురావాలన్నా నిమిషాల్లో పనైపోతుందని, జీతాలు చెల్లించేందుకు మాత్రం కుంటిసాకులు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ రెండు రోజుల్లోగా జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు వి.జ్యోతి, కె.బాస్కర్‌రావు, మురళి, పి.వెంకటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు ఫణంగా పెట్టి..

కుమార్తె ప్రాణాలను కాపాడుకునేందుకు నాగావళి నదిలో తల్లిదండ్రుల సాహసం

ప్రజాశక్తి-కొమరాడ

మండలంలో నాగావళి నది ఆవల ఉన్న ప్రజలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఏ చిన్న కష్టం వచ్చినా నది దాటి రావాలంటే వారికి అదో పెద్ద గండంగా మారుతుంది. ప్రాణాలను ఫణంగా పెట్టి నాగావళి నది దాటుకొని రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే తరహా ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తమ కుమార్తె పసిప్రాణాలను కాపాడుకునేందుకు తల్లిదండ్రులు తమ ప్రాణాలను పణంగా పెట్టి చేసిన ప్రయత్నం పలువురిని కంటతడి పెట్టించింది.



నదిలో తడకపై కుమార్తెను తీసుకెళ్తున్న సోమయ్య, చంద్రమ్మ

మండలంలోని చొల్లపదం రెబ్బ గ్రామానికి చెందిన కోలక సోమయ్య, చంద్రమ్మ కుమార్తె మరియమ్మ (7) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. నాగావళి నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వైద్య సిబ్బంది వచ్చి సేవలందించే పరిస్థితి లేకపోయింది. దీంతో పరిస్థితి కాస్త విషమించడంతో తన కుమార్తె ప్రాణాలను కాపాడుకునేందుకు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి నాగావళి నది దాటే ప్రయత్నం చేశారు. స్థానికంగా దొరికే వెదురు కర్రలతో తడకలాగా తయారు చేశారు. దానిపైన తన కుమార్తెను పెట్టుకొని చుట్టుపక్కల వారి సహాయంతో నదిలో మోసుకొని అవతలి ఒడ్డుకు చేరారు. ఒక పసి ప్రాణం కోసం కుటుంబ సభ్యులు ప్రాణాలు ఫణంగా పెట్టి ఒడ్డుకు చేర్చారు. అక్కడ నుంచి కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రాయగడ వెళ్లారు. చికిత్స అనంతరం నాగావళి నదిలో ఇబ్బందులు పడుతూ ఇంటికి చేరారు.

నది దాటుతున్న సమయంలో తమ కష్టాలను బాహ్య ప్రపంచానికి తెలిపేందుకు గిరిజనులు ఒక వీడియో తీసి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేసి 'మా బాధలను, కష్టాలను ఇప్పటికైనా తప్పించండి' అంటూ ఒక సందేహాన్ని పంపారు. గిరిజనులు నదిలో పడిన కష్టాలకు సంబంధించిన వీడియోతో పాటు ఆ సందేశం పలు గ్రూపుల్లో వైరల్‌గా మారింది. గిరిజనులకు ఎంతో అవసరమైన పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో నది దాటేందుకు అటువైపున గిరిజనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వంతెన పనులు ప్రారంభించి ఏళ్ళు గడుస్తున్నా కనీసం సగానికి పైగా కూడా పనులు జరగనీ పరిస్థితి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొంచెం పనులు ముందుకు కదల్లేదు. దీంతో వర్షాకాలంలో ఏ చిన్న కష్టం వచ్చినా నది దాటేందుకు ప్రాణాలు ఫణంగా పెట్టి రావాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఎంతోమంది గిరిజనులకు అవసరమైన పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదాయం మిన్న.. నిర్వహణ సున్నా

వాణిజ్య సముదాయాలను పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం మున్సిపాలిటీకి ఆదాయాన్ని సమకూర్చే ఐడిఎస్ఎంటి వాణిజ్య సముదాయం నిర్వహణను అధికారులు, పురపాలకులు గాలికి వదిలేశారు. నిర్వహణ బాధ్యతను మున్సిపల్ అధికారులు విస్మరించడంతో ఆ వాణిజ్య సముదాయాల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రూ.53 లక్షల వ్యయంతో 50 దుకాణాలలో నిర్మించి 2006లో ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు కనీస నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో ఈ సముదాయం శిథిలావస్థకు చేరుకుంది. పలుచోట్ల స్లాబ్ పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. వాణిజ్యసముదాయం లోపల పశువుల సంచారంతో మల, మూత్ర వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ సముదాయాల వల్ల మున్సిపాలిటీకి నెలకు 3.85 లక్షల రూపాయలు ఆదాయం వస్తోంది. కానీ సముదాయానికి కనీస మరమ్మతులు చేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టకపోవడం బాధాకరమని అందులో అద్దెకు ఉంటున్న యజమానులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా తయారైన వాణిజ్య సముదాయం



విడిపోయిన గూడ్స్‌రైలు బోగీలు

తప్పిన ప్రమాదం

గూడ్స్ రైలు నుంచి విడిపోయిన బోగీలు

ప్రజాశక్తి-కొమరాడ

బొగ్గుతో రాయగడ వైపు నుంచి విశాఖపట్నం వస్తున్న గూడ్స్ రైలు లింకు తెగి శుక్రవారం ఉదయం కొన్ని బోగీలు విడిపోయాయి. నాలుగు భోగీలు వెనుక వైపు ఉండిపోయాయి. స్వామినాయుడు వలస రైల్వే గేట్ సమీపంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో కొంత సమయంపాటు గేట్ వేయడంతో అటు రాయగడ, ఇటు పార్వతీపురం వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. గతంలో కూడా ఇదే ప్రదేశంలో రాయగడ వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న గూడ్సురైలు ఇంజిన్ నుంచి బోగీలు విడిపోయాయి.

విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో నాలుగు రోడ్ల కూడలిలోని ఉన్న బంధంవారి వీధిలో ఉన్న దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రూ.1.60 లక్షలు విలువైన గుర్తింపు లేని కంపెనీలు తయారు చేసే సిగరెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీసులకు అప్పగించి తదుపరి విచారణ చేయాలని విజిలెన్స్ సిఐ బి.సింహాచలం ఆదేశించారు. ముందస్తు సమాచారం మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాలో లోపాలుండొద్దు

ఐటిడిఎ పిఒ కల్పన కుమారి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పన కుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ఓటర్ల జాబితాలో తప్పిదాలు ఉండకూడదని, అత్యంత పారదర్శకంగా ఓటర్ సర్వే జరిగేలా చర్యలు తీసు కొంటున్నామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. శుక్రవారం పాలకొండ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు, మరణించిన వారి పేర్లు తొలగించడం, పోలింగ్ బూత్‌లను సరిచేయడం, వేరే రాష్ట్రాలకు చెందిన వారి ఓట్లు తొలగించడం వంటివి చేసేటప్పుడు నిబంధనల ప్రకారం చేయాలన్నారు. ఓటరు సర్వేలో రాజకీయ పార్టీల వ్యక్తుల ప్రమేయం ఉండకుండా చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. కేవలం బిఎల్‌ఒలు, సంబంధిత సూపర్‌వైజర్లు మాత్రమే సర్వేలో పాల్గొనాలని స్పష్టంచేశారు. వాలంటీర్లు, ఎన్‌జిఒలు, ఇతర రాజకీయ పార్టీల వ్యక్తుల ప్రమేయం ఉండకూడదన్నారు. బిఎల్‌ఒలు సర్వే చేసేటప్పుడు ముందుగా నియమించిన రాజకీయ పార్టీల ఏజెంట్లు పాల్గొనవచ్చున్నారు. సర్వే షెడ్యూల్‌ను రాజకీయ పార్టీలకు అందజేయాలని అన్నారు. రాజకీయ పార్టీలు చెప్పిన అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. కొత్త పంచాయతీలకు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామన్నారు. బోగస్ ఓట్లు తొలగిస్తామన్నారు. ఒకే ఇంటి నంబర్ మీద ఎక్కువ ఓట్లు ఉన్న అంశాన్ని పరిశీలించి వాటిని కూడా తొలగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.కళావతి, ఎపిఒ రోషిరెడ్డి, తహశీల్దారు నరసింహమూర్తి, డిటిలు, నాగేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో నూతనంగా నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే వి.కళావతి, ఐటిడిఎ పిఒ కల్పనకుమారి శుక్రవారం ప్రారంభించారు. తాలాడ సచివాలయం సుమారు 40 లక్షలతో, కడగండి సచివాలయం సుమారు 40 లక్షలతో నిర్మించారు. తాలాడలో వైఎస్‌ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ రూ.17.50 లక్షల అంచనా విలువతో నిర్మించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర లక్ష్మి, ఎంపిపి బి.ఆదినారాయణ, జెడ్‌పి కోఆప్షన్ సభ్యులు సవర లక్ష్మి, ఎఎంసి చైర్మన్ హిమరిక మోహన్, వైస్ ఎంపిపి కె.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

లార్వా నివారణకు చర్యలు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

లార్వా నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు.. వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎన్‌జిఒ సమావేశ భవనంలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల హెల్త్ సూపర్‌వైజర్లకు ఆరోగ్య కార్యక్రమాలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దోమలు పునరుత్పత్తి చెందే స్థావరాలను గుర్తించి యాంటీ లార్వా టీమోఫాస్ పిచికారీ చేయించాలన్నారు. ఇంటిలో ఎసిఎం 5 శాతం పిచికారీ చేయించాలన్నారు. ఫీవర్ సర్వే పూర్తి స్థాయిలో చేపట్టి, జ్వర లక్షణాలు గుర్తిస్తే వెంటనే మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు చేసి, చికిత్స ఇవ్వాలన్నారు. ఇప్పటికే అన్ని ఆరోగ్య కేంద్రాలకు టెస్ట్ కిట్లు పంపిణీ చేశామన్నారు. డ్రై డే కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలన్నారు. వసతిగృహాలను తరచుగా సందర్శించి, సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులకు చికిత్స, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

ఈ నెల 7 నుండి 12వ తేదీ వరకు నిర్వహించే మొదటి దశ మిషన్ ఇంద్రధనుష్ టీకాల కార్యక్రమానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. సర్వేలో గుర్తించిన అర్హులకు టీకాలు వేయించాలని, ముందుగా వీరందరినీ యూవిన్ పోర్టల్ లో నమోదు త్వరగా పూర్తిచేయాలన్నారు.

ఈ నెల 10న నిర్వహించే డీవార్మింగ్ (నులి పురుగులు నివారణ) కార్యక్రమానికి సన్నాహక ఏర్పాట్లు గురించి వివరించారు. సమావేశంలో జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్, ఎపిడిమియాలజిస్ట్ డాక్టర్ ఎం.నవీన్ కుమార్, జిల్లా మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, ఎఎంఒ సూర్యనారాయణ, డెమో సన్యాసిరావు, ఎస్‌ఒ శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ జగన్నాథరావు

ఐదుగురికి ట్రిపుల్ ఐటి సీట్లు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలో పుట్టూరు గ్రామానికి చెందిన ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సీట్లు సంపాదించారు. రెడ్డి శరత్‌కుమార్, చిగురుడు యోజిత, కర్రి రమ్య, జక్కు తనిశా, మర్రాపు హేమంత్ కుమార్ బందలుప్పి, పెద్ద బొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి చదివి, అత్యధిక మార్కులు సంపాదించారు. ట్రిపుల్ ఐటి రెండో జాబితాలో సీట్లు సంపాదించారు. వీరిని ఎంపిటిసి యోగిరెడ్డి లక్ష్మి, మాజీ సర్పంచ్ రమణమూర్తి, సర్పంచి సతీష్‌కుమార్ అభినందించారు.

7, 8న విఆర్ఎల రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

విఆర్ఎ సమస్యలపై ఈ నెల 7, 8వ తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆధ్వర్యాన మండలంలోని విఆర్ఎలు తహశీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతి అందించారు. మండలంలోని విఆర్ఎలంతా దీక్షల్లో పాల్గొంటున్నట్లు తెలియజేశారు.



చెరువుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే విక్రాంత్

చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీ పరిధిలోని వెంకటరాయుని కోనేరుకు 38 లక్షలు, వడమ చెరువుకు 40 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పాలవలస విక్రాంత్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు కొరికాన గంగానాయుడు, కొంచాడ అరుణ్, దుప్పాడ పాపినాయుడు, తుమ్మల లక్ష్మణరావు, పల్లా భాను, పాలవలస ధవళేశ్వరరావు, ఆకుల కుమార్, పల్లి లక్ష్ముంనాయుడు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-సీతానగరం

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని గుచ్చిమి, అంటిపేట గ్రామ సచివాలయాలలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రామాలలో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. అనంతరం గ్రామ స్వచ్ఛ నిర్మల్ గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కె.కె వర్మ, సర్పంచులు బొంగు తిరుపతిరావు, శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శులు ధనలక్ష్మి, భూషణ్ పాల్గొన్నారు

జ్వరాల సమాచారం ఇవ్వాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామల్లో జ్వరాలు ఉన్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని ఎంపిడిఒ జిజె ప్రసాద్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వీరఘట్టం, బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. తరచూ గ్రామాలను సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. జ్వర పీడితులు అధికంగా ఉంటే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, మానస పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టాలని వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని జనసేన జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ ఐటిడిఎ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావుకు వినతి అందించారు. ఈ సీజన్ వసతిగృహాల విద్యార్థులు మలేరియాకు ఆందోళన కలిగిస్తోందన్నారు. మినరల్ వాటర్, దోమతెరలు సదుపాయం కల్పించాలన్నారు. డిడి శ్రీనివాసరావు స్పందిస్తూ మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేసేందుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు.



నోట్ పుస్తకాల నిల్వలను పరిశీలిస్తున్న ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్

నోట్ పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న నోట్ పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ కోరారు. గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల్లోని 17 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 6888 మంది గిరిజన విద్యార్థులకు నోట్ పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పాటించాలని, బాగా చదువుకోవాలని కోరారు.

నాడు-నేడు పనుల్లో ఇఒలదే కీలక పాత్ర

ప్రజాశక్తి-బలిజిపేట

పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కీలకపాత్ర పోషించాలని ఎంఇఒ సామల సింహాచలం సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ విజయలక్ష్మి అధ్యక్షతన ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యాశాఖ చేపడుతున్న నాడు-నేడు కార్యక్రమాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలని ఆదేశించారు.

అధ్వానంగా కాలువలు

ప్రజాశక్తి-మక్కువ

వెంగళరాయ సాగర్ పరిధిలోని పలు కాలువలు అధ్వాన స్థితిలో ఉన్నాయని జనసేన పార్టీ మండల నాయకులు గేదెల రిషివర్ధన్ తెలిపారు. కాలువలు బాగు చేయకుండా నీరు విడుదల చేస్తూ హడావుడి చేశారని ఆరోపించారు. శుక్రవారం శాంతిశ్వరం, తూరుమామిడి గ్రామాలకు వెళ్లే కాలువను వారు పరిశీలించారు. కోన గ్రామానికి వెళ్లే కాలువ పూర్తి అధ్వానంగా మారిందని, ఇలాంటి కాలువల ద్వారా నీరు ఎలా వస్తుందని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల మేలుకోరే విధంగా కాలువలు బాగు చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-సీతంపేట

వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని సీతంపేట, రాజాం, రుషికొండ ఉపమాక దేవాలయాల ఎఇఒ జగన్మోహన ఆచార్యులు తెలిపారు. శుక్రవారం వెంకటేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయ సేవా కమిటీ, డోనర్స్ కమిటీ ఆధ్వర్యంలో తొలి సమావేశం నిర్వహించారు. సీతంపేట, రాజాం ఆలయాలకు కోఆర్డినేటర్‌గా నెమ్మది అప్పలనాయుడు నియమించినట్లు చెప్పారు. సమావేశంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, రిటైర్డ్ ప్రిన్సిపల్ మజ్జి సత్యం, నిమ్మక కాంతారావు, నీలకంఠ యాదవ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారుల భద్రతపై ఎందుకంత నిర్లక్ష్యం?

పిఆర్ డిఇ నిలదీసిన జెడ్‌పిటిసి మావుడి • భద్రతా చర్యలపై సభ ఏకగ్రీవ తీర్మానం

ప్రజాశక్తి-మక్కువ

ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్నా పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారుతున్నాయని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిఆర్ డిఇ శర్మ మాట్లాడుతుండగా జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రస్తుత కాలంలో రహదారులకు గడ్డుకాలం వస్తుందని, రోడ్లపైనే దమ్ము చేసుకునే ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరగడంతో పూర్తిగా అధ్వానంగా తయారవుతున్నాయని చెప్పారు. దీనిపై ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడం దారుణమని నిలదీశారు. ఇప్పటికైనా పోలీస్ శాఖతో సమన్వయంగా ముందుకు వెళ్లి రహదారులు పాడుచేస్తున్న వారిపై చర్యలు చేపట్టకుంటే రానున్న రోజుల్లో రహదారులు రూపాలు లేకుండా పోయే ఆస్కారం ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే 'జాగ్రత్తలు పాటించుకుంటే రహదారులకు నష్టమే' అనే శీర్షికతో ప్రజాశక్తిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సభలో అదే అంశం చర్చకు వచ్చింది. రహదారి భద్రతపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సభ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది.

తూముల లీకులు సంగతి మీరు చెప్పండి

వెంగళరాయ సాగర్ నుండి ప్రధాన తూముల ద్వారా నీరు లీకేజీ రూపంలో వృథాగా పోతున్నా చర్యలు చేపట్టకుండా సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని చెప్పడంలో అర్ధమేముందని తూరుమామిడి సర్పంచ్ ఆర్.కృష్ణంనాయుడు వెంగళరావు జెఇ జగదీశ్‌ను ప్రశ్నించారు. రెండు పంటలకు నీరు ఇవ్వలేమని చెప్పడం పక్కన పెడితే లీకేజీని ఎలా నివారిస్తారని సభకు తెలపాలని జెఇని జెడ్‌పిటిసి శ్రీనివాసరావు ప్రశ్నించారు. చేపల చెరువుల యజమానుల కోసం సాగర్ నీటిని వృథా చేస్తున్నారని చెముడు ఎంపిటిసి గోపాలకృష్ణ ఆరోపించారు వెంగళరాయసాగర్ అధికారులు నీటి పర్యవేక్షణలో విఫలమవుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జైకా నిధులతోనైనా సాగర్ రైతులకు సక్రమంగా నీరందేలా చర్యలు చేపట్టాలని కోరారు.



రహదారులపై పిఆర్ డిఇని ప్రశ్నిస్తున్న జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు

ఇదేం ఇంటర్నెట్. ఎక్కడికక్కడే తీగలు కట్..

ప్రభుత్వ పాఠశాలలకు స్మార్ట్ టీవీలు మంజూరయ్యాయని ఎఇఒ సభకు వివరించారు. ఏకధాటిగా సర్పంచులంతా మాట్లాడుతూ ఇంటర్నెట్ వైర్లు ఎక్కడికక్కడ తెగిపడి భూముల్లో దొర్లుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదని, పాఠశాలలకు ఇంకా ఇంటర్నెట్ విద్యాబోధన ఎలా ఉంటుందని వారు ప్రశ్నించారు. మండలమంతా ఇదే విధంగా వేసిన వైర్లన్నీ తెగిపడే ఉన్నప్పటికీ పునరుద్ధరణకు ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఉందని వాపోయారు. ఐదు పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు ఎంపిపి మర్రి పారమ్మ, జెడ్‌పిటిసి శ్రీనివాసరావు అందజేశారు.

సమావేశంలో ఎంపిడిఒ సూర్యనారాయణ, ఉపతహశీల్దార్ ఇబ్రహీం, వైస్ ఎంపిపి నరసయ్య, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కురుపాం.. ర్యాలీలో పాల్గొన్న ఆర్‌జెడి చిన్మయిదేవి, ఐసిడిఎస్ అధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - కురుపాం

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. శుక్రవారం మండలంలో గుమ్మ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు తాగడం వల్ల బిడ్డ ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుండి మూడేళ్లపాటు తల్లిపాలు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. అనంతరం అంగన్వాడి కేంద్రాల్లో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీడీ కె.విజయగౌరి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : నూతనంగా ఏర్పాటు చేసిన కొమరాడ ఐసిడిఎస్ ప్రాజెక్టును ఆర్‌జెడి చిన్మయిదేవి సందర్శించారు. అనంతరం స్వామినాయుడువలస అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రీస్కూలును పరిశీలించి పలు విషయాలపై చర్చించారు. ఆరుగురు గర్భిణులకు సీమంతాలు చేశారు. కార్యక్రమంలో సిడిపిఒ సుగుణ, సెక్టార్ సూపర్‌వైజర్ ఎల్.శారదాంబ, అంగన్వాడీ కార్యకర్త లత పాల్గొన్నారు.

నానో యూరియాతో పంటకు మేలు

ప్రజాశక్తి-పాచిపెంట

నానో యూరియా వినియోగంతో పంటకు ఎంతో మేలని మాతుమూరు గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శనగల సింహాచలం తెలిపారు. శుక్రవారం మాతుమూరు రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎక్కువ మోతాదులో భూమిలో ఎరువులు వెయ్యడం వల్ల భూమి సారం తగ్గిపోతుందన్నారు. పంటపై పిచికారీ చేసుకునే అవకాశం ఉన్న నాను యూరియా రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పురుగుమందులో కలిపి కూడా పిచికారి చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. అనంతరం విఎఎ దినేష్‌కుమార్.. అజోల్లా ఉపయోగాలు, కల్తీ పురుగుమందులను గుర్తించడంపై వీడియోలను ప్రదర్శించారు. అనంతరం ప్రకృతి సేద్య సిఆర్‌పి తిరుపతి నాయుడు ద్రవ జీవామృతం తయారీకి ఉపయోగపడే సంచులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు పాల్గొన్నారు

అందుబాటులో ఎరువులు

సీతానగరం : రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ ఎస్.అవినాష్ తెలిపారు. మండలంలోని ఇప్పలవలస రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-పంట నమోదు జిపిఎస్ ఆధారంగానే జరుగుతుందని అన్నారు. కౌలుకార్డులు తీసుకోవాలన్నారు. కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. సమావేశంలో ఎంపిటిసి గొల్ల శాంతకుమారి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పాల ఈశ్వర్ నారాయణ పాల్గొన్నారు.



సీతానగరం.. కంది విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎఒ అవినాష్

రోడ్డు సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్



బిటి రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

మండలంలోని పులుగుమ్మి నుండి సీతానగరం మండలం రేపటివలస శివారు గ్రామానికి దశాబ్దాలుగా సరైన రహదారి లేక నానా ఇబ్బందులు పడుతుండేవారు. ఇటీవల ఎమ్మెల్యే అలజంగి జోగారావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆ గ్రామం వెళ్లారు. గ్రామస్తులు వ్యథ ఆలకించిన ఆయన శాశ్వత పరిష్కారం కల్పించడం కోసం అధికారులను ఆదేశించారు. స్పందించిన అధికారులు నిధులు కేటాయించి రూ.1.20 కోట్లతో బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. శుక్రవారం నిర్మాణ పనులను పర్యవేక్షించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావును గ్రామస్తులు కలిసి ఎన్నో ఏళ్ల తమ కల నెరవేర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, బలగ శ్రీరాములు నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, బలిజిపేట ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి బి.రవికుమార్, పిఎసిఎస్ చైర్మన్ కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను వినియోగించుకోవాలి

ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రైతులకు అందిస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని బందలుప్పిలో నియోజకవర్గ స్థాయిలో ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా రైతులకు సబ్సిడీపై 10 వేలు విలువైన విత్తనాలు, ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన ఉపకరణాలు ప్రధానమంత్రి అజయ్ పథకంలో భాగంగా పంపిణీ చేశారు. ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.సుధారాణి మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 604 మంది దళిత రైతులకు విత్తనాలు, పిఎండిఎస్ కిట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముఖరాజు మాట్లాడుతూ ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ఒక్కొక్క రైతుకు రూ.7,630 విలువ కలిగిన వ్యవసాయ ఉపకరణాలు, ఫెరామిన్ ట్రాప్స్, లూర్స్, ఎల్లో స్టికీ ప్లేట్స్, టార్పాలిన్స్, డ్రమ్ములు మొదలగునవి కూడా త్వరలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

రహదారి పరిశీలన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో బీటీ రోడ్డు నుండి లోవగూడ వరకు ఉపాధి హామీలో 75 లక్షలతో నిర్మించిన రహదారిని శుక్రవారం ట్రైబల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ క్వాలిటీ కంట్రోల్ ఇఇ మూర్తి, డిఇ రవికుమార్ తనిఖీ చేశారు. రహదారి నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇ రమేష్ ఉన్నారు.

జిజెసి ప్రిన్సిపల్‌గా శంకరరావు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపల్‌గా పైల శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందరూ సమయపాలన పాటించాలని, విద్యార్థుల అభ్యున్నతికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు.

అగరబత్తి తయారీలో శిక్షణ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని ఆడారు గ్రామంలో గిరి క్రాంతి విడివికెకి చెందిన 35 మంది సభ్యులకు శుక్రవారం ఎస్‌బిఐ, ఆర్‌ఎస్ఇటిఐ సహకారంతో అగరుబత్తుల తయారీలో శిక్షణ ఇచ్చారు. టిపిఎంయు ఎపిడి వై.సత్యంనాయుడు మాట్లాడుతూ అగరుబత్తి పరిశ్రమను విజయవంతంగా నడిపేందుకు సామర్థ్యం సంపాదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ ఆర్‌ఎస్ఇటిఐ డైరెక్టర్ జిబివి రమణ, కో ఆర్డినేటర్ వై.వర్మ, ఎల్‌హెచ్‌పి డిపిఎం ప్రవీణ కుమార్, ఎపిఎం సురేష్ , ఎల్‌హెచ్ ఎపిఎం జయకుమార్ పాల్గొన్నారు.

యాచక వృద్ధురాలికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

పార్వతీపురంలో 22వ వార్డు గాంధీ సత్రం వద్ద ఎన్నో ఏళ్ల నుంచి యాచకవృత్తి చేసుకుంటూ జీవిస్తున్న వృద్ధురాలు శుక్రవారం మరణించింది. ఎక్కడి నుంచో వచ్చిన ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో స్థానికులు వైద్యం చేయించారు. శుక్రవారం ఆమె మరణించడంతో వైసిపి వార్డు కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బోటు రామకృష్ణ, వార్డు యువకులు కోరాడ శేఖర్, కొప్పిల సంతోష్ ఆమె మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి, మానవత్వాన్ని చాటుకున్నారు.

వీరఘట్టం, నడిమికెల్లలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని వీరఘట్టం, నడిమికెళ్ల గ్రామాల్లో శుక్రవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వరపీడితులకు, మధుమేహ, రక్తపోటు రోగులకు, గర్భిణులకు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతకుమారి, నయామీ, ఎంఎల్‌హెచ్‌పి కావ్య, ఎఎన్ఎంలు శకుంతల, జానకి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో రూపాయి గ్రామానికి చెందిన భాస్కరరావు (65) శుక్రవారం ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రూపాయి గ్రామ సమీపంలో పొలంలో దమ్ము పడుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు అక్కడికి చేరుకునేలోపే ఆయన మరణించాడు. భాస్కరావుకు భార్య, పిల్లలు ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



బోల్తా పడిన ట్రాక్టర్



రహదారిపై గుంతలో చేరిన వర్షపు నీటిని చూపిస్తున్న టిడిపి నాయకులు

దురుద్దేశంతోనే రోడ్డు పనులు నిలిపేశారు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జయకృష్ణ ఆరోపణ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని విక్రమపురం జంక్షన్ నుండి కంబరవలస మీదుగా కంబర వరకు రోడ్డు పనులను ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్యే విక్రాంత్ ఉద్దేశ పూర్వకంగా నిలిపేశారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని యు.వెంకంపేట గ్రామ రహదారిని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో ఆ రహదారి మరమ్మతులు చేపట్టేందుకు రూ.36 లక్షలు మంజూరైతే, పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడం, ప్రభుత్వం మారడం ఆగిపోయాయని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కావాలని ఆ రోడ్డు పనులు ఆపేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు యు.ఉదయభాస్కర్, ఎఎంసి మాజీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు పారిచర్ల వెంకటరమణ, మాచర్ల నందిశ్వరరావు, బల్ల హరిబాబు, మాచర్ల అనిల్, శ్రీనివాసరావు, భాస్కరరావు, పి.తిరుపతి, వంగపండు పకీర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పత్తిపంటను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

అంతర పంటల పరిశీలన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని రెట్లపాడు గ్రామంలో రైతులు పత్తిలో సాగుచేస్తున్న అంతర పంటలను వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు శుక్రవారం పరివీలించారు. పత్తి మధ్యలో కంది పంట, పత్తి చుట్టూ కంచి పంటగా ఆముదం, ఎరపంటగా చిక్కుడు వెయ్యడం వల్ల శత్రు పురుగులతోపాటు మిత్ర పురుగులు సంఖ్య కూడా ఎక్కువగా ఉండడం గమనించారు. అతి తక్కువ ఖర్చుతో తయారైన దశపత్ర కషాయంతో రసం పీల్చే పురుగులను పూర్తిగా నివారించుకుని మిత్ర పురుగులను కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులకు దీనిపై అవగాహన కల్పించాలని ఐసిఆర్‌పి సుకరమ్మ, విఎఎ సాయిగణేష్‌కు సూచించారు. వరి పంటను వరుసలలో నాటించాలని, పూర్తిస్థాయి ప్రకృతి సేద్యం చేయించాలని తెలిపారు.



విజయరామరాజుకు కేక్ తినిపిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి

ఘనంగా శత్రుచర్ల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు 79వ జన్మదిన వేడుకలను జియ్యమ్మవలస మండలం చినమేరంగి కోటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జులు బేబినాయన, విజయ్‌చంద్ర, సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి జగదీశ్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బేబినాయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ స్థలం కోసం వినతి

ప్రజాశక్తి - కురుపాం

ట్రాన్స్‌జెండర్లు ఉండడానికి కమ్యూనిటీ స్థలాన్ని కురుపాం మండల కేంద్రంలో మంజూరు చేయాలని మన్యం జిల్లా హిజ్రాల అసోసియేషన్ అధ్యక్షులు అడ్డాకుల గీతారాణి.. తహశీల్దార్ ఆర్.రమేష్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో సుమారు 300 మందికి పైగా ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని, గాంధీనగర్ వీధిలో ఇంటిని అద్దెకి తీసుకొని కొందరు నివశిస్తున్నారని గీతారాణి తెలిపారు. స్థలాన్ని మంజూరు చేస్తే, భవన నిర్మాణం కోసం గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే కలెక్టర్ ద్వారా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.